క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. రెండో వార్డుకు చెందిన కప్పల పెంచలయ్య, షేక్ అమీర్‌బీ, 19వ వార్డుకు చెందిన కాంతమ్మ, షేక్ సందానీ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఉత్తరక్రియల కోసం రూ.10వేలు చొప్పున నగదును అందజేశారు. ట్రస్ట్ సభ్యులు నరసింహారెడ్డి, రాంపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల సంఖ్యను పెంచాలి



ఉదయగిరి రూరల్: మండలంలోని ఉపాధి హామీ పనులకు హాజరయ్యే దినసరి శ్రామికుల సంఖ్యలను పెంచాలని ఎంపీడీఓ అప్పాజీ, ఏపీఓ ఉమామహేష్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. శ్రామికులకు క్షేత్రసహాయకులు కొలతల ప్రకారం పనులు కేటాయించి గిట్టుబాటు వేతనం అందేలా చూడాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ సువార్తయ్య పాల్గొన్నారు.

రీసర్వే పరిశీలన



చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం నెర్నూరులో జరుగుతున్న రీ సర్వేను జేసీ కార్తీక్ గురువారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. పాత సర్వే నంబర్లు నమోదు చేయకపోవడం, నోషనల్ ఖాతాగా నమోదు చేయడం, తదితర పొరపాట్లు చేయొద్దని సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, తహసీల్దార్ బీ మురళి, సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.

పంట కాలువల ఆక్రమణపై పరిశీలన



ఆత్మకూరు: పట్టణంలోని స్పార్క్‌సిటీ వెనుక వైపు 20 ఎకరాల్లో నిర్మిస్తున్న నాలుగు లేఅవుట్లలో పంట కాలువలను ఆక్రమించారని ఫిర్యాదులు అందడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. గతంలో కొందరు మున్సిపాలిటీ, నుడా అనుమతులు లేకుండా, ఇరిగేషన్ కాలువలను ఆక్రమించి లేఅవుట్లను నిర్మిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ ఏఈ రవికుమార్, సర్వేయర్లు రాజా, రమేష్, వీఆర్వోలు లేఅవుట్లను పరిశీలించారు. పంటకాలువలను సర్వే చేసి హద్దులను నిర్ధారిస్తూ కర్రలను నాటారు. రైతు సంఘం నాయకులు, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వెలుగు కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణను అందజేస్తోందని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

మెట్టప్రాంతవాసుల కల సాకారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 161బీజీ హైవే పనులు ప్రారంభం

- శరవేగంగా నిర్మాణ పనులు
- అందుబాటులోకి దుత్తలూరు-సీతారామపురం రహదారి
- ఇటీవల జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- మారుతున్న పల్లెల రూపురేఖలు

ఉదయగిరి: మెట్టప్రాంతవాసుల కల ఫలించింది. ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న జాతీయ రహదారి స్వప్నం నేటికి నెరవేరింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి-సీతారామపురం జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్రంతో పట్టుపట్టి నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా దుత్తలూరు- సీతారామపురం మధ్యన పనులు శరవేగంగా సాగడంతో 161బీజీ జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. ఇటీవల అమరావతి వచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా జాతీయ రహదారిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.దుత్తలూరు-సీతారామపురం మధ్యన 167బీజీ జాతీయ రహదారి నిర్మాణం కోసం 36.4 కి.మీ దూరానికి రూ.360 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను ఆర్‌కే- ఎంఆర్‌బీఆర్ కాంట్రాక్ట్ సంస్థ దక్కించుకుంది. అగ్రిమెంట్ ప్రకారం 13 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, 14 నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో వాహనాలు అతిత్వరగా రాకపోకలు సాగించే సౌకర్యం కలిగింది. ఈ రహదారిని సీతారామపురం మండల కేంద్రం గుండా వెళ్లే సింగరాయకొండ-పోరుమామిళ్ల జాతీయ రహదారికి (167బీ)అనుసంధానం అవుతోంది. అంతేకాకుండా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న విజయవాడ-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు కూడా అనుసంధానం కానుంది. దీంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి అతివేగంగా రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు సాగించవచ్చు.



దుత్తలూరు-సీతారామపురం మధ్యన పూర్తయిన హైవే

భూముల ధరలకు రెక్కలు

అభివృద్ధికి చిహ్నాలు రహదారులు. రాకపోకలకు అనువైన పరిస్థితులు ఉంటే అన్నీ రంగాల్లో ఆ ప్రాంతాలు కూడా అభివృద్ధి పథంలో ముందుకెళుతాయి.జిల్లాలో అన్నీ రంగాల్లో అత్యంత వెనుకబడిన ఉదయగిరి మెట్టప్రాంతానికి పలు జాతీయ రహదారుల నిర్మాణం గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రాణం పోసుకున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణంతో భూముల విలువలకు రెక్కలు వచ్చాయి. రెండేళ్ల క్రితం వరకు రోడ్డు సమీపంలో ఎకరా ధర రూ.5 లక్షలు ఉండగా, అదే నేడు ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతోంది. రోడ్డు నుంచి లోపలి వైపు ఉన్న భూములు కూడా కనిష్టంగా రూ.7 లక్షలకు తక్కువ పలకడం లేదు.దీంతో రైతుల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. పండ్లు, కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను శరవేగంగా సుదూర ప్రాంతాలకు రవాణా చేసే వీలుకలగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు రూ.100 కోట్ల పరిహారం

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు సుమారు రూ.100 కోట్ల వరకు పరిహారాన్ని అందజేశారు. దుత్తలూరు సెంటర్‌లో 565 జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. వాగులు, వంకలు, కాలువలు ఉన్న చోట్ల వంతెనలు నిర్మించారు. ఎత్తు పల్లాలను సరిచేస్తూ రాకపోకలకు అనువుగా మార్చారు. సీతారామపురం మండలం బసినేనిపల్లి వద్ద టోల్ గేట్ ఏర్పాటు చేశారు. కావలి-దుత్తలూరు మధ్యన జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే కావలి-సీతారామపురం మధ్యన 114.6 కి.మీ దూరం రాకపోకలు చాలా వేగంగా సాగే అవకాశం కలుగుతుంది.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

వరికుంటపాడు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హేమంత్‌కుమార్ గురువారం తెలిపారు. కందుకూరు సబ్‌కలెక్టర్ పాల్గొంటారని చెప్పారు. నోషనల్ ఖాతాలు కలిగిన రైతులు రెగ్యులర్ ఖాతాల కోసం ఆధారాలు చూపించాలన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లూరు: నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. కొత్తరేషన్‌కార్డులు, కార్డుల విభజన, కుటుంబసభ్యులను చేర్చడం, తొలగించడం, రైస్ కార్డు సరెండర్, తదితర సేవలను గ్రామ సచివాలయాల్లో అందిస్తున్నారని చెప్పారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలానికి 33 యూనిట్ల రుణాలను కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన ముస్లిం, సిక్కు, జైన్, పార్శీలు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం



ఆత్మకూరులో బ్రహ్మంగారి గ్రామోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో ఆరాధన ఉత్సవాలను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.



ఆత్మకూరులో బ్రహ్మంగారి గ్రామోత్సవం

వైభవంగా గ్రామోత్సవం

కొండాపురం :మండలంలోని కొమ్మిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో స్వామి, అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. ఆలయ ధర్మకర్త కంచర్ల కేశవాచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా శుక్రవారం గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అన్నదాత సుఖీభవకు రైతుల గుర్తింపు

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఏడీఏ పీ చెన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో భూమి కలిగిన రైతుల వివరాలను అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్, రైతుసేవా కేంద్రాల్లో, గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద అందుబాటులో ఉంచామని చెప్పారు. సీతారామపురం మండలంలో 6,003, ఉదయగిరిలో 8,695, దుత్తలూరులో 10,374, వరికుంటపాడులో 10,962, మర్రిపాడులో 11,415 మంది రైతుల భూమి, ఆధార్ వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు రైతుసేవా కేంద్రాల్లో అర్హులైన రైతుల గుర్తింపు కార్యక్రమం చేపడుతామని తెలిపారు. అనంతరం ఆర్టీజీఎస్ ద్వారా అన్ని రికార్డులను పరిశీలించి వీపీఏలకు పంపుతారన్నారు. ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



సంగంలో కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు

ఆత్మకూరు: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని పట్టణంలో కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవాన్ని బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి చప్పరంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆర్య వైశ్య యువత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంగం: స్థానిక మెయిన్ బజార్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. వాసవి మాతను పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కోలాట ప్రదర్శనతో అలరించారు.



ఆత్మకూరులో కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్రగాయాలు

కలిగిరి: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కలిగిరి పొగాకు వేలం కేంద్రం ఎదురుగా గురువారం చోటు చేసుకుంది. వివరాలు..వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాళేనికి చెందిన కాట్రగుంట రాఘవేంద్ర కలిగిరి నుంచి పొగాకు వేలం కేంద్రంలోకి వెళ్లేందుకు మోటార్‌సైకిల్‌పై రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి కలిగిరి వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో రాఘవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. పొగాకు వేలం కేంద్రంలోని రైతులు గమనించి 108 వాహనంలో కలిగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.



తీవ్రంగా గాయపడిన రాఘవేంద్ర

బొగ్గేరు వంతెనపై ప్రాణాంతక ప్రయాణం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు-సోమశిల రహదారిలో దేపూరు వద్ద ఉన్న బొగ్గేరు వంతెనపై ద్విచక్ర వాహనదారులు ప్రాణాంతక ప్రయాణం సాగిస్తున్నారు. వంతెనకు ఇరువైపులా మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అంతేగాకుండా వాహనాల వేగానికి ఇసుక రేణువులు ఎగిరి కళ్లలో పడుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వంతెనపై పలు చోట్ల రోడ్డు కూడా దెబ్బతిని ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఇసుకను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బొగ్గేరు వంతెనపై పేరుకుపోయిన ఇసుక

వింజమూరు ఉపసర్పంచ్ రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న జయలక్ష్మి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ మిడిదాల జయలక్ష్మి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆమె తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఆమె గత పంచాయతీ ఎన్నికల్లో మూడో వార్డు నుంచి గెలుపొందారు. అనంతరం ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా వ్యక్తిగత కారణాలతో ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె లేఖలో పేర్కొన్నా వాస్తవంగా గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు రాజీనామా చేసినట్లుగా సమాచారం.తదుపరి ఉపసర్పంచ్‌గా గున్నం సుశీల ఎన్నికయ్యే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

గంగమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు: మండలంలోని తూర్పుచెన్నంపల్లిలో పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇన్‌చార్జి ఏపీఓగా ఉమామహేష్



ఉదయగిరి: మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీఓగా కే ఉమామహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఏపీఓగా పనిచేస్తున్న బీ శ్రీనివాసరావు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో కలిగిరి మండల ఏపీఓగా పనిచేస్తున్న ఉమామహేష్‌ను ఇన్‌చార్జి ఏపీఓగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

చేజర్ల(ఆత్మకూరు): ఆటో ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన చేజర్ల మండలం ఆదూరుపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..చిత్తలూరుకు చెందిన లక్ష్మీకాంతమ్మ ప్రతిరోజూ ఆదూరుపల్లి సెంటర్‌లో పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. రోజూలాగే గురువారం రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న ఆటో ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన లక్ష్మీకాంతమ్మను స్థానికులు వెంటనే నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

సోమశిల: అనంతసాగరం మండలం శంకరనగరంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శంకరనగరంలో గురువారం సోమశిల-ఆత్మకూరు బస్సును నిలిపి ఉండగా గ్రామానికి చెందిన వేముల పవన్‌కళ్యాణ్ మద్యం మత్తులో అద్దాలను గట్టిగా కొట్టాడు. దీంతో కిందకు దిగి ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించగా పవన్‌కళ్యాణ్ తనపై దాడికి పాల్పడ్డాడని డ్రైవర్ అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హరిహర క్షేత్రం..నల్లగొండ్ల

- జిల్లాలోని ఏకైక శైవవైష్ణవ దేవస్థానం
- నేటి నుంచి లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు


వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరిహర క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. జిల్లాలో ఏకైక శైవవైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రంలో శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి, త్రయంబికా సమేత మల్లేశ్వరస్వామి నిత్య పూజలు అందుకుంటున్నారు. ఏటా వైశాఖ శుద్ధ ద్వాదశి రోజు నుంచి లక్ష్మీనరసింహస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది శుక్రవారం నుంచి తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

నల్లగొండ్ల క్షేత్రానికి వేయి సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. పల్లవులు, చోళులు, గజపతులు, విజయనగర రాజులు, ఉదయగిరి, నెల్లూరు నవాబులు, జూపల్లి పెదలక్ష్మిరాయుడు, గురజాల రామన్న పంతులు, ఈస్టిండియా కంపెనీ వారి పాలనలో కూడా లక్ష్మీనరసింహస్వామికి నిత్య ధూపదీప నైవేద్య కైంకర్యాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శ్రీకృష్ణ దేవరాయలు ఉదయగిరి దుర్గాన్ని జయించినప్పుడు ఈ క్షేత్రాన్ని సందర్శించి ఏడంతస్తుల గాలిగోపురం నిర్మించి నరసింహస్వామికి బంగారు గురుడ సేవ జరిపించారని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ క్షేత్రానికి 400 ఎకరాల భూమి ఉంది. భూముల కౌలుతో పాటు భక్తుల కానుకల ద్వారా ఏడాదికి రూ.15 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం పాలకమండలి నియామకం చేపట్టనందున ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు మాజీ చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి బ్రహ్మోత్సవాల నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

ఈ నెల 9న అంకురార్పరణ, 10న ధ్వజారోణం ,11న హనుమంతసేవ, 12న బంగారు గురుడ సేవ, 13న గజోత్సవం, 14న శ్రీవారి కల్యాణోత్సవం, 15న అలకలతోపు, 16న వసంతోత్సవం, 17న ఏకాంతసేవ నిర్వహించనున్నారు.



నల్లగొండ్లలోని హరిహర క్షేత్రం

అలకలతోపునకు ఎంతో విశిష్టత

నల్లగొండ్ల క్షేత్రంలో జరిపే అలకలతోపు(పరుగు పందెం) ఉత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. తూర్పువైపు మెట్ల నుంచి శ్రీవారిని, పడమర వైపు మెట్ల నుంచి అమ్మవారిని కొండపైన ఉన్న ఆలయానికి చేర్చుతారు. శ్రీవారు విజయం సాధిస్తే వాణిజ్య పంటలు, అమ్మవారు విజయం పొందితే మాగాణి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తులు నమ్ముతారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



అన్ని శాఖల అధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, అన్నదానం, తదితర, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఎల్‌సీ కొండారెడ్డి, మాజీ చైర్మన్, ఆలయ ధర్మకర్తల మండలి

పొగాకు రైతుల శ్రేయస్సుకు చర్యలు

కలిగిరి: పొగాకు రైతుల శ్రేయస్సుకు చర్యలు తీసుకుంటామని పొగాకుబోర్డు చైర్మన్ సీ యశ్వంత్ తెలిపారు. కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. పొగాకు కంపెనీల ప్రతినిధులు, రైతులతో చర్చించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెరగనీయడం లేదని, మీడియం గ్రేడ్, లోగ్రేడ్‌ను కొనుగోలు చేయకపోవడంతో వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తుందని రైతులు విన్నవించారు. ఇలాగే మార్కెట్లో ధరలు కొనసాగితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ ఈ ఏడాది నాణ్యమైన పొగాకు దిగుబడులు వచ్చిన నేపథ్యంలో వేలంలో మంచి ధరలకు కొనుగోలు చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్, పొగాకుబోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న పొగాకుబోర్డు చైర్మన్ యశ్వంత్

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.280 ధర లభించింది. వేలానికి 850 బేళ్లు రాగా, 533 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.249.69 ధర లభించిందని వివరించారు.

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 376 బేళ్లను వేలానికి తీసుకురాగా, 287 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్టంగా రూ.210, సరాసరిన రూ.258.28 ధర లభించిందని వివరించారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం మజరా అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం సీతారామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాల ప్రతిష్ఠను వేడుకగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం జరిపారు. తొలుత ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠలకు దాతలుగా పీ వెంకటరమణయ్య, అరుణ, వెంకట్రావు, మీరాబాయి, కరేటి రమణయ్య, పూర్ణిమ, నరసమ్మ, రమణయ్య,చంద్రశేఖర్, విజయమ్మ, రవి, బిందు దంపతులు వ్యవహరించారు.

